
సాక్షి
సంగారెడ్డి
బుధవారం । 14 । ఆగస్టు । 2024



భూసారం ఆధారంగా..
భూసారం ఆధారంగా ఎరువులను వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయి.
వివరాలు 8లో ▸



భద్రత డొల్ల
ఆధ్యాత్మిక క్షేత్రమైనా ఏడుపాయల వద్ద భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.
వివరాలు 8లో ▸



నిరుపయోగంగా..
మున్సిపల్ దుకాణాలను అద్దెకు ఇవ్వకుండా అధికారులు నిరుపయోగంగా వదిలేశారు.
వివరాలు 9లో ▸

పల్లెల్లో ఫార్మా చిచ్చు

మా ప్రాణాలతో చెలగాటం ఆడొద్దంటున్న గ్రామస్తులు

- 90 శాతం సాగు భూములే..
- గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లను వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు



న్యాల్‌కల్ మండలంలోని డప్పూరు గ్రామంలో సాగవుతున్న పచ్చని పంట పొలాలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అవన్నీ పచ్చని పల్లెలు. అక్కడ రెండు పంటలు పండే సాగు భూములవి. కొర్రలు, సామలు, ఊదలు వంటి చిరుధాన్యాలు సాగు చేసే పొలాలవి. పెసర, మినుము, కంది వంటి పప్పు దినుసులతో పాటు, చెరుకు సాగు చేస్తూ తీపిని పంచే రైతులు వారు. 90 శాతానికి మించి సాగుభూములే అవి. ఎటు చూసినా కనుచూపు మేరకు పచ్చదనం పరుచుకున్న పల్లెలవి. ఇలా పచ్చని పల్లెల్లో ఇకపై ఫార్మా చిచ్చు రేగనుంది. రెండు పంటలు పండే భూములను ఫార్మా కంపెనీ కోసం సేకరించాలని తీసుకున్న నిర్ణయంతో ఆ గ్రామాల రైతుల గుండెల్లో గుబులు రేపుతోంది. ఇప్పటికే జిల్లాలో ఫార్మా కంపెనీలు వదిలే గాలి, నీరు, భూగర్భ జలాల కాలుష్యంతో చేస్తున్న ప్రకృతి విధ్వంసాన్ని కండ్ల నిండా చూస్తున్న గ్రామస్తులు.. ఇకపై తమ గ్రామాలు కూడా కాలుష్య కాసారంలో కలిసిపోతాయనే ఆందోళన చెందుతున్నారు. భూములు లాక్కుని ఫార్మా కంపెనీలు పెడితే తమ పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో ఆ గ్రామాల వాసులు

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పదిచోట్ల గ్రీన్‌ఫీల్డ్ ఫార్మా క్లస్టర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జహీరాబాద్ ప్రాంతంలో సుమారు 2003 ఎకరాల భూముల్లో ఈ ఫార్మా క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. న్యాల్‌కల్ మండలం డప్పూరు, వడ్డి, మాల్గీ గ్రామాల పరిధిలో ఈ మేరకు భూసేకరణ చేపట్టి.. ఆ భూములను ఫార్మా కంపెనీలకు అప్పగించాలని యోచిస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల ఆ గ్రామాల ప్రజలు భగ్గుమంటున్నారు. తమ గ్రామాల్లో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తున్నారు. తరతరాలుగా ఈ భూములనే నమ్ముకుని జీవనాధారం పొందుతున్న తమ గ్రామాల్లో ఫార్మా చిచ్చు పెట్టొద్దని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

ఫార్మా విధ్వంసం అంతాఇంతా కాదు

ఫార్మా కంపెనీలు వస్తే ఆ ప్రాంతం అంతా పర్యావరణం విధ్వంసం అవుతుంది. ఈ కంపెనీలు విడుదల చేసే వాయు కాలుష్యంతో ఊపిరి పీల్చుకోవడమే కష్టమవుతుంది. అలాగే ఈ కంపెనీల నుంచి నిబంధనలకు విరుద్ధంగా వదిలే కాలుష్య జలాలతో ఆ ప్రాంతంలోని భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమవుతాయి. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. ఇప్పటికే జిన్నారం, ఖాజీపల్లి, పటాన్‌చెరు, హత్నూర మండలాల్లోని ఫార్మా కంపెనీల నుంచి వచ్చే కాలుష్యంతో అనేక గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వారి అష్టకష్టాలు చూస్తున్న ఈ గ్రామస్తులు తమ గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు.

దశలవారీగా పోరాటం

ఫార్మా కంపెనీల ఏర్పాటుకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఈ ఉద్యమం దశల వారీగా ఉధృతం చేస్తామని చెబుతున్నారు. ఇందులో భాగంగానే సోమవారం ఈ మూడు గ్రామాల ప్రజలు సుమారు 500 మంది వరకు డప్పూరులో సమావేశమయ్యారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

భూమి లేకుంటే రోడ్డున పడతాం



నాకున్న ఎకరం 39 గుంటల పొలంలో ఆకుకూరలు, కూరగాయల పంటలను సాగు చేసుకుని ఏడాదికి రూ.1.80 లక్షల వరకు సంపాదిస్తా. జీవనాధారమైన భూమిని లాక్కుంటే నా కుటుంబం రోడ్డున పడుతుంది. ప్రభుత్వం ఎన్ని డబ్బులు ఇచ్చినా భూమి మాత్రం ఇవ్వను. బలవంతంగా తీసుకుంటే ఊరుకోను. ప్రాణమైన ఇస్తా కానీ భూమి మాత్రం ఇచ్చేది లేదు.
–పాండు, రైతు, డప్పూరు గ్రామం, న్యాల్కల్ మండలం

భూములు ఇచ్చే ప్రసక్తే లేదు



నాకున్న మూడున్నర ఎకరాల్లో చెరుకు, పత్తి పంటలను సాగు చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న. సారవంతమైన భూములను ప్రభుత్వం తీసుకొని కాలుష్యకారక ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోంది. కాలుష్యం వల్ల భూములు పాడవడంతో పాటు, రోగాల బారినపడతాం. ఎట్టి పరిస్థితుల్లోనూ భూములివ్వం.
– ఓంకార్, రైతు, వడ్డి గ్రామం, న్యాల్కల్ మండలం

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కొండాపూర్(సంగారెడ్డి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం సెప్టెంబర్ 9వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసేందుకు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదివే విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు http//bse.telangana.gov.in ఆన్‌లైన్ ద్వారా అప్లయ్ చేసుకోవాలని సూచించారు. బీసీ, జనరల్ విద్యార్థులకు పరీక్ష ఫీజు రూ.100 కాగా, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులకు రూ.50 చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

న్యాయం చేయండి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే చింతా

సంగారెడ్డి టౌన్: ట్రిబుల్‌ఆర్ రోడ్డు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాపూర్ మండలం గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్ గ్రామంలో ట్రిబుల్‌ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులుగా భూమి ఇవ్వాలని, లేదంటే మార్కెట్ ధరకు అనుకూలంగా పరిహారం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలలో నూతన రోడ్ల నిర్మాణాలు, రహదారుల మరమ్మతుల నిమిత్తం 60 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞాపన పత్రం అందించారు. మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రిని కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. నూతన రహదారుల నిర్మాణానికి రూ.43 కోట్ల రూపాయలు, రహదారుల మరమ్మతులకు రూ.17 కోట్లు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క.. త్వరలోనే ఇందుకు సంబంధించిన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

అర్హులందరికీ రుణమాఫీ



బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న ఏడీఏ

ఝరాసంగం(జహీరాబాద్): అర్హులందరికీ రైతు రుణమాఫీ జరుగుతుందని జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. కొంతమంది రుణమాఫీ కాలేదని ఫిర్యాదు చేయడంతో మంగళవారం మండల పరిధిలోని బర్దిపూర్ కెనరా బ్యాంకు శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ అకౌంట్ నంబరు తప్పులు, ఆధార్ వివరాలు సరిగ్గా లేకపోవడం, పంట రుణాలు రెన్యువల్, వివిధ సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదన్నారు. బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రుణమాఫీ కింద రూ.5కోట్లు విడుదల కాగా రూ.3కోట్లు రైతుల రుణమాఫీ ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

సంగారెడ్డి టౌన్: నిరుద్యోగులకు జిల్లా ఉపాధి కార్యాలయంలో బుధవారం (14వ తేదీ) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి అనిల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోషిబా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 100 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని తెలిపారు. పూర్తి సర్టిఫికెట్లతో పట్టణంలోని పాత డీఆర్డీఓ కార్యాలయంలో హాజరు కావాలన్నారు.

దేశ సమగ్రతకు రాజీవ్‌గాంధీ కృషి



సంగారెడ్డి : ర్యాలీలో జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): దేశ సమగ్రతకు, అభివృద్ధికి రాజీవ్‌గాంధీ ఎనలేని కృషి చేశారని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. ఈనెల 11వ తేదీన తమిళనాడులో ప్రారంభమైన రాజీవ్‌గాంధీ జ్యోతి సద్భావన యాత్రకు మంగళవారం మండల పరిధిలోని ఆరూర్ గ్రామంలో పార్టీ శ్రేణులతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తమిళనాడు నుంచి ప్రారంభమైన ఈ యాత్ర 10 రాష్ట్రాలను కలుపుకొని మూడు వేల కిలోమీటర్లు కొనసాగి న్యూఢిల్లీలోని రాజీవ్ స్మారక స్థలం వీర్‌భూమికి చేరుకుంటుందన్నారు. 33 ఏళ్ల నుంచి ప్రతీ ఏడాది ఈ యాత్ర కొనసాగడం గొప్ప విషయమన్నారు. రాజీవ్‌గాంధీ దేశంలో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని, ఐటీ రంగ అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంరెడ్డి, మండల అధ్యక్షుడు సిద్దన్న, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణ, కౌన్సిలర్లు రవి, నాగరాజ్ గౌడ్, విశ్వనాథం, నాయకులు ఆంజనేయులు, అరుణ్, చిరు, శరత్, ప్రేమ్, శేఖర్ యాత్ర నిర్వాహకులు పాల్గొన్నారు.

సంగారెడ్డి : రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా శ్రీపేరంబదూర్ నుంచి ఢిల్లీ వరకు రాజీవ్ జ్యోతి యాత్ర చేస్తున్న దొరయి బృందానికి సంగారెడ్డి పట్టణంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో జగ్గారెడ్డి, నిర్మలా రెడ్డి పాల్గొన్నారు.

నీటి సరఫరా బంద్

సంగారెడ్డి: పట్టణంలో బుధవారం, గురువారం మిషన్ భగీరథ నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తెలిపారు. పోలకంపల్లి, బుదేర గ్రామాల వద్ద పంపింగ్ మెయిన్‌కి ఏర్పడిన లీకేజీకి మరమ్మతు పనులు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని 4, 5, 6, 7, 8, 9, 10, 11, 12, 15,16,23,24,25,26,27,28,29,30,31,32, 33,34,35,37 వార్డులలో నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు.

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గంలో బుధ, గురువారాల్లో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ఉండదని సంబంధిత అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ మండలం బుసారెడ్డిపల్లి ప్రాంతంలో మెయిన్ పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీకి మరమ్మతులు చేపడుతున్న కారణంగా నీటి సరఫరా జరగదని పేర్కొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి



సోయాబీన్ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: యాజమాన్య పద్ధతుల ద్వారా పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని సంగుపేటలోని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు రాహుల్, సరిత అన్నారు. మంగళవారం మండలంలోని రంజోల్ గ్రామంలో రాజురెడ్డి సాగు చేస్తున్న ఆదిలాబాద్ సోయాబీన్ 15రకం సోయాబీన్ పంటను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా యాజమాన్య పద్ధతుల గురించి సూచనలు చేశారు. ముఖ్యంగా ఈ రకం సోయాబీన్ మిగతా రకాలతో పోల్చుకుంటే త్వరగా కోతకు వస్తుందని, కాయ పరిమాణం, గింజ నాణ్యత కూడా బాగుంటుందని తెలియజేశారు. అనంతరం గ్రామంలో సాగులో ఉన్న టమాట, గోబి పంటలను పరిశీలించి సస్యరక్షణ చర్యల మెలకువల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా మామిడి తోటల్లో కత్తిరింపులు తప్పని సరిగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్‌కుమార్, రాజురెడ్డి, ఫెరోజ్, రాజు, వెన్నెల పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న రమేష్

సంగారెడ్డి టౌన్: మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాల, కొత్లాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు 100, 181, 1098 హెల్ప్ లైన్ నంబర్లను ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, ఎక్సైజ్ శాఖ అధికారి నవీన్ చంద్ర, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి పాల్గొన్నారు.

క్రైం రేటు పెరిగిందనడం అవాస్తవం

- అసత్య ప్రచారాలను నమ్మొద్దు
- డీజీపీ జితేందర్



సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : రాష్ట్రంలో నేరాలు (క్రైం రేట్) పెరగలేదని, కొందరు కావాలని పోలీసులను బ్లేం చేస్తున్నారని రాష్ట్ర డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. గత ఏడాది హైదరాబాద్ సిటీలో ఎన్ని హత్యలు జరిగాయో.. ఈ ఏడాది అదే స్థాయిలో ఉన్నాయని అన్నారు. మంగళవారం ఆయన సంగారెడ్డి ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగంపై పోలీసుశాఖ ఉక్కుపాదం మోపుతుందని అన్నారు. డయల్ 100కు వచ్చే కాల్స్ విషయంలో సంబంధిత పోలీసులు వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు మున్సిపల్, ఇంజినీరింగ్, నేషనల్ హైవే అథారిటీ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామన్నారు. బేసిక్ పోలీసింగ్‌లో మరింత మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం జిల్లాలోని ఎనిమిది పోలీస్‌స్టేషన్లలో చైల్డ్‌ఫ్రెండ్లీ కార్నర్‌లను ప్రారంభించారు. డీజీపీ వెంట మల్టీజోన్ ఐజీ–2 వి.సత్యనారాయణ, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్ పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బు జమ చేయాలి

సంగారెడ్డి టౌన్ : రుణమాఫీ డబ్బులను రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని కలెక్టర్ క్రాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో బ్యాంకు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు వేదికలలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి రైతుల నుంచి డాక్యుమెంట్లు స్వీకరించాలని, రుణాలను రెన్యువల్ చేసి నగదు రూపంలో డబ్బులు అందించాలన్నారు. కొత్త లోన్ వివరాలు, పాత లోన్ రెన్యువల్ వివరాలు బ్యాంకులవారీగా అందించాలన్నారు. మహిళాశక్తి కేంద్రాల ఏర్పాటుకు బ్యాంకర్లు మహిళా సంఘాలకు ఆర్థికంగా చేయూతనందించాలన్నారు. మహిళా శక్తి రూపంలో భాగంగా 13 రకాల కార్యక్రమాలు మహిళా సంఘాల సభ్యులకు జీవనోపాధి ప్రణాళికను ఏర్పాటు చేయాలన్నారు. ఆగస్టు నెల నాటికి 345.47 కోట్ల రూపాయలు మహిళా సంఘాలకు లక్ష్యం పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్, అధికారులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఆందోళన



రాజీవ్ చౌక్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థులు

నారాయణఖేడ్: విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం నారాయణఖేడ్‌లో ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. రీయింబర్స్‌మెంట్ భిక్షకాదని, తమ హక్కు అని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.8,200 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

డ్రగ్స్ నిర్మూలన ప్రతీఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న పల్లవి, విద్యార్థులు

కంది(సంగారెడ్డి): మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ పల్లవి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మామిడి పల్లి, కోతలాపూర్ గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల ప్రాముఖ్యత, లింగ సమానత్వం, ఆరోగ్యం, విద్య, ఉద్యోగ, అభివృద్ధి తదితర అంశాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మామిడిపల్లి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ సుజాత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ స్వామి, కృష్ణవేణి పాల్గొన్నారు.

పాఠశాలలకు పారిశుద్ధ్య నిధులు

- మూడు నెలలకు సరిపడా నిధులు ఒకేసారి విడుదల
- నేరుగా అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాల్లో జమ
- విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తొలగనున్న ఇబ్బందులు



కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఊడ్చేవారు, కడిగేవారు లేకపోవడంతో తరగతి గదులు పాఠశాల ఆవరణ, మరుగుదొడ్లు, మూత్రశాలలు కంపు కొడుతున్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో తాత్కాలిక పద్ధతిలో కొనసాగిన స్కావెంజర్లు ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య సేవలు అందించేవారు. అయితే విద్యాశాఖ 2022 ఆగస్టు 31 నుంచి వారిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలల శుభ్రత బాధ్యత పంచాయతీ కార్మికులకు అప్పజెప్పారు. కానీ వారు అటువైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించిన జీఓ 21ను అన్ని పాఠశాలలకు పంపించారు.

జిల్లాలో 1247 పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా 1247 ప్రభుత్వ, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణకు మూడు నెలలకు సరిపడా నిధులను ఒకేసారి విడుదల చేయనుంది. ఈ నిధులను నేరుగా అమ్మ ఆదర్శ కమిటీల ఖాతాలో జమ చేయనున్నట్లు జీఓలో పేర్కొంది. వీటి ద్వారా ప్రతీరోజు పాఠశాలల తరగతి గదులతో పాటు పరిసరాలు, మూత్రశాలలు, మరుగుదొడ్లను శుభ్రం చేయడం, మొక్కలకు నీరు పట్టడం తదితర పనులు చేపడుతారు.

విద్యార్థుల సంఖ్య	విడుదల కానున్న నిధులు
1–30	రూ.3 వేలు
31–100	రూ. 6 వేలు
101–250	రూ.8 వేలు
251–500	రూ.12 వేలు
501–700	రూ.15 వేలు
750 పైన	రూ.20 వేలు

జీఓ వచ్చింది.. నిధులు రాలే



పాఠశాలల్లో పారిశుద్ధ్యానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీఓ వచ్చిన మాట వాస్తవమే. ఈ జీఓను జిల్లాలోని అన్ని పాఠశాలలకు పంపించాం. కానీ నేటివరకు నిధుల విడుదలపై కానీ, వాటి ఖర్చుపై కానీ ఎలాంటి స్పష్టత లేదు. ఈ నిధులను నేరుగా అమ్మ ఆదర్శ కమిటీ ఖాతాలో జమ అవుతాయి.
– వెంకటేశ్వర్లు, డీఈఓ

తొలగనున్న ఇబ్బందులు

గత ప్రభుత్వం స్కావెంజర్‌లను తొలగించినప్పటి నుంచి పాఠశాలలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చాలా పాఠశాలలో పంచాయతీ వారు పాఠశాలలను శుభ్రం చేసేందుకు రాకపోవడంతో మరుగుదొడ్లు, పరిసరాలను, మూత్రశాలలను శుభ్రం చేసేందుకు ఉపాధ్యాయులు సొంత ఖర్చులతో ప్రైవేట్ వ్యక్తులను నియమించుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పారిశుద్ధ్యానికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాఠశాలల్లో ఇబ్బందులు తొలగిపోనున్నాయి. ఈ నిధుల విడుదలపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసే క్రమంలో..
– సైబర్ మోసం

పటాన్‌చెరు టౌన్: నగదు క్రెడిట్ కార్డులో అప్‌డేట్ కాలేదని కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసే క్రమంలో సైబర్ వలలో పడి బాధితుడు నగదు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన పటాన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ముత్తంగి డీఎస్ కాలనీకి చెందిన ఒక కిరాణా షాప్ నిర్వాహకుడు. ఈనెల 10న తన క్రెడిట్ కార్డుకు చెల్లించిన నగదు అప్‌డేట్ చూపించకపోవడంతో కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసే క్రమంలో సైబర్ వలలో పడ్డాడు. దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా తన వివరాలు తెలపడంతో ఖాతాలో ఉన్న రూ.83 వేల నగదు డ్రా అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.

ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన కారు
– రెండు ముక్కలైన వాహనం


రెండుగా విడిపోయిన ట్రాక్టర్

కొండాపూర్(సంగారెడ్డి): ముందున్న ట్రాక్టర్‌ను అతి వేగంతో వచ్చిన కారు బలంగా ఢీకొట్టగా.. ఇంజిన్ రెండు భాగాలుగా విడిపోయింది. ఈ సంఘటన మంగళవారం మండల పరిధిలోని మునిదేవునిపల్లిలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం .. మునిదేవునిపల్లికి చెందిన విఠల్ ట్రాక్టర్‌ను తీసుకొని తన పొలానికి వెళ్తున్నాడు. కుడి వైపునకు తిరుగుతుండగా సంగారెడ్డి నుంచి మైతాబ్‌ఖాన్ గూడెం వైపు వస్తున్న ఎల్ అండ్ టీ సంస్థకు చెందిన కారు.. ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాక్టర్ ఇంజిన్ రెండు భాగాలు విడిపోయింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం సంగారెడ్డిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని సాక్షులు తెలిపారు.

ప్రాణం తీసిన ఈత సరదా
ఇసుక మడుగులో దిగి యువకుడి మృతి


ఇలియాజ్(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): సరదాగా స్నేహితులతో కలిసి విందు చేసుకొని ఇసుక మడుగులో దిగి ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దశంకరంపేటకు చెందిన మహమ్మద్ ఇలియాజ్(30) సోమవారం సాయంత్రం తన స్నేహితులైన ఎండీ.షాదుల్, సుల్తాన్, ఎన్.యాదగిరిలతో కలిసి శివారులోని మైసమ్మ చెరువు వద్ద విందు చేసుకొని మద్యం తాగారు. ఆ మత్తులో చెరువు వద్ద ఇసుక మడుగులో ఈతకు దిగి మునిగి చనిపోయాడు. స్నేహితులు, స్థానికులు కలిసి చెరువులో వెతికినా ఫలితం లేకపోయింది. మంగళవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. ఇలియాజ్ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతుడి తల్లి మహమ్మద్ హసీనా బేగం ఫిర్యాదు మేరకు ఎస్ఐ.శంకర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సెంట్రింగ్ కలప ట్రాక్టర్ బోల్తా

నర్సాపూర్: సెంట్రింగ్ పనిలో ఉపయోగించే కలపను తరలిస్తున్న ట్రాక్టర్ నర్సాపూర్–హైదరాబాద్ మార్గంలో బోల్తా పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల్ల మండలం దోమడుగు నుంచి సెంట్రింగ్ పనిలో ఉపయోగించే కలపను నర్సాపూర్‌కు ట్రాక్టర్‌లో తీసుకు వస్తుండగా పట్టణ శివారులో ట్రాక్టర్ బోల్తా పడింది. సరుకు అంతా రోడ్డుపై అడ్డంగా పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కల్గింది. స్థానిక ఎస్ఐ–2 శ్రీనివాస్ తన సిబ్బందితో అక్కడికి వచ్చి దాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా, బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయని పోలీసులు చెప్పారు.

భద్రత డొల్ల

- మసక బారుతున్న ఏడుపాయల ఆలయ ప్రతిష్ఠ
- హడలెత్తిస్తున్న చోరీలు.. కృంగదీస్తున్న జలమరణాలు
- ఇటీవల హుండీల అపహరణలో పోయింది రూ.3 వేలేనా?
- మొక్కుబడిగా పోలీసులకు ఫిర్యాదు
- పట్టించుకోని ఈఓ



పాపన్నపేట(మెదక్): ఆధ్యాత్మిక కేంద్రం.. పర్యాటక క్షేత్రం అయిన ఏడుపాయల భద్రతపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. భద్రతలో డొల్లతనమే కారణమని తెలుస్తోంది. తరచూ దొంగ తనాలు.. స్నానం చేస్తూ భక్తుల మరణాలతో ఆలయ ప్రతిష్ఠ మసక బారుతోంది. తెలంగాణలో ప్రసిద్ధి గాంచిన ఏడుపాయలకు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల నుంచి ఏటా సుమారు 20 లక్షల భక్తులు వస్తుంటారు. సుమారుగా హుండీ ఆదాయం రూ.12 కోట్ల ఆదాయం దాకా వస్తుంది. ఇక్కడ 10 మంది సెక్యూరిటీ, 25 మంది ఉద్యోగులు ఉన్నారు. 46 సీసీ కెమెరాలు ఉంటే అందులో ఐదు పని చేయడం లేదు. ఇటీవల ఏడుపాయల్లో జరుగుతున్న నేర సంఘటనలపై స్పందించిన ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, ఆరుగురు పోలీసులను విధుల్లో ఉంచుతామని ప్రకటించారు. అయినా పోలీస్ ఔట్ పోస్టు నామ మాత్రమే అయ్యింది. నేరాల సంఖ్య తగ్గడం లేదు.

దొంగతనాలు..:
శనివారం రాత్రి ఏడుపాయల్లోని ఆలయ మండపంలోకి ఇద్దరు దొంగలు ప్రవేశించి ఏకంగా 1, 12 నంబర్ ఇనుప హుండీలు ఎత్తుకెళ్లారు. వాటిలో ఉన్న నగదు, కానుకలు దొంగిలించి, ఖాళీ హుండీలను 100 మీటర్ల దూరంలో పడేసి వెళ్లారు. అయితే విధుల్లో ఉండాల్సిన ఇద్దరు సెక్యూరిటీ, వాచ్‌మన్ ఈఓ కార్యాలయంలో తమకేమి పట్టనట్లు నిద్రపోయారని తెలిసింది. అక్కడ సీసీ కెమెరాలున్నా కనీసం వాటి వైపు తొంగి చూడలేదు. దొంగతనం జరిగిన విషయం తెలిసినా, కనీసం ఈఓ కృష్ణ ప్రసాద్ తెల్లవారుజామున కూడా ఆలయానికి చేరుకోలేదు. పోలీసులకు స్వయంగా ఫిర్యాదు చేయలేదు. ఆలయంలో ఉన్న ఉద్యోగి ఒకరు మొక్కుబడిగా ఫిర్యాదు చేశారు. 10 రోజులపాటు భక్తులు వేసిన సొమ్ము, రెండు హుండీలతో కలిపి సుమారు రూ.3 వేలు ఉండొచ్చునని ఫిర్యాదు చేశారు.


దొంగతనం జరిగిన హుండీని తీసుకొస్తున్న సిబ్బంది

రెండేళ్ల క్రితం..

రెండేళ్ల క్రితం ఇలాగే ఓ వ్యక్తి మండపంలోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడితే కేవలం రూ.80 వేల సొత్తు చోరీ జరిగి ఉంటుందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దొంగను పట్టుకొని అతడి నుంచి రూ.3.60 లక్షలను పోలీసులు రికవరీ చేశారు. గతంలో సైతం ఆలయంలో పనిచేసే ఓ ఉద్యోగి దుర్గమ్మ గర్భగుడికి సంబంధించిన కడప వెండి తొడుగు దొంగిలించారు. అంతకు ముందు పలు సార్లు దుర్గమ్మ ఆలయ హుండీ పగుల గొట్టిన దొంగలు నగదు ఎత్తుకెళ్లారు. ఇటీవల ఆరు నెలల కాలంలో సుమారు 10 నుంచి 12 మంది భక్తులు ఏడుపాయల్లో స్నానం చేస్తూ నీట మునిగి మరణించారు. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారని భక్తులు వాపోతున్నారు. ఈ విషయమై ఈఓ కృష్ణ ప్రసాద్‌ను వివరణ కోరగా చోరీ జరిగిన రోజు తాను సెలవులో ఉన్నానన్నారు. ఆలయానికి రాలేకపోయానన్నారు. దొంగ తనం కేసులో పోయింది కేవలం రూ.3 వేలు మాత్రమే అని ఫిర్యాదు చేసి ఉండాల్సింది కాదన్నారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

- గతనెల 31న ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య
- మృతిపై అనుమానం ఉందని యువతి మామ ఫిర్యాదు
- తంప్లూర్‌లో ఘటన


మృతదేహాన్ని పరిశీలిస్తున్న అధికారులు


సుప్రజ(ఫైల్)

టేక్మాల్(మెదక్): పూడ్చిన ఇంటర్ విద్యార్థిని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తన మేనకోడలి మృతిపై అనుమానం ఉందని పోలీసులకు మామ ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు వారు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం తంప్లూర్ గ్రామానికి చెందిన గోష్కి సుప్రజ(16) తాత వద్ద నివాసముంటుంది. మెదక్ మండలం హవేళిఘనపూర్ ఎంజేపీ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. గత నెల 30న ఎవరికి చెప్పకుండా ఇంటికొచ్చింది. మరుసటి రోజు (గత నెల 31వ)న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. చదువులో ఒత్తిడిని భరించలేక చనిపోయిందేమో అనుకొని బంధువులందరి సమక్షంలో ఈనెల 1న సొంత పొలంలో పూడ్చారు. కుటుంబ సభ్యులకు అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో మానసికంగా, శారీరకంగా యువతిని వేధిస్తుండేవాడని గ్రామస్తుల ద్వారా సమాచారం తెలిసింది. దీంతో మేనకోడలి మృతి పట్ల అనుమానం ఉన్నట్లు సుప్రజ మామ గోష్కి సాయిలు ఈనెల 7న చేసిన ఫిర్యాదు మేరకు పోలీస్ కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా మంగళవారం అల్లాదుర్గం సీఐ రేణుక, తహసీల్దార్ కృష్ణ, ఏఎస్ఐ తుక్కయ్యల సమక్షంలో పూడ్చిన ప్రాంతంలోంచి మృతదేహం బయటికి తీయగా సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి ఫోరెన్సిక్ అధికారులైనా డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ చంద్రదీపక్ పోస్టుమార్టం నిర్వహించారు. ఈ నివేదిక వచ్చిన తర్వాత కేసు పూర్వాపరాలు తెలియవస్తాయని పోలీసులు తెలిపారు. కాగా, ఈ ఘటన కలకలం రేపింది.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం

రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి


మాట్లాడుతున్న మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి

జగదేవ్‌పూర్(గజ్వేల్): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం అందించడానికి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిందని, ఇవి ఆరోగ్యకరమని రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో పీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జీవ వైవిధ్యంపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడారు. పాత రోజుల్లో తాతముత్తాలు సేంద్రియ ఎరువులతో పంటలు పండించేవారని గుర్తు చేశారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా పది కాలల పాటు బతికారన్నారు. కానీ నేడు రసాయన ఎరువులతో పంటలు పండించి వాటినే ఆహారంగా తీసుకోవడంతో మనషుల జీవన ప్రమాణాలు తగ్గిపోయాయన్నారు. ఆ పంటల సాగును మహిళలు అలవాటు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహారం అందించేందుకు ప్రణాళిక రూపొందిస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అంతకు ముందు కొండ పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, మ్యాక్స్ డైరెక్టర్ అరుణ, మాజీ ఎంపీటీసీ కవిత, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సిబ్బంది మహేశ్, పద్మ, శోభ, వెంకట్‌లక్ష్మి, నాగమణి, రాజు, నరేశ్, నిఖిల్, మహిళలు పాల్గొన్నారు.

బీబీపేట పాఠశాల ముట్టడి


పాఠశాలలో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, గ్రామస్తులు

కల్హేర్(నారాయణఖేడ్): మధ్యాహ్న భోజనం తిని అస్వస్థతకు గురైన ఘటనపై మంగళవారం అధికారులు విచారణకు వచ్చారని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు మండలంలోని బీబీపేట పాఠశాలను ముట్టడించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంఈఓ శంకర్ స్కూల్‌ను సందర్శించగా.. వారి వద్ద పాఠశాల హెచ్‌ఎం, వంట నిర్వాహకుల నిర్లక్ష్యమే కారణమని విమర్శించారు. ఇప్పటికే హెచ్‌ఎం నర్సింగ్‌ను సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. అయినా జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో మధ్నాహ్న భోజనం వంట నిర్వాహకులను తొలగించాలని పట్టుబట్టారు. కొత్తగా కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. దీంతో కొంతసేపు అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నెల 20న కొత్తగా కమిటీ ఏర్పాటు చేస్తామని, వంట నిర్వాహకులను నియమిస్తామని భరోసా ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సంధ్యారాణి పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బండారి సాయిలు, బీఆర్ఎస్ నాయకులు మారపు సాయిలు పాల్గొన్నారు.

బైకుల దొంగ అరెస్టు

- 15 బైకులు స్వాధీనం
- జల్సాలకు అలవాటు పడి చోరీలు : ఎస్పీ ఉదయ్



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): బైకులను దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 15 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. చేగుంట ఎస్ఐ బాలరాజు జాతీయ రహదారిపై వాహన తనిఖీల్లో భాగంగా మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన మోతి జనార్దన్ బైకును ఆపడానికి ప్రయత్నించగా వాహనం వదిలేసి పారిపోయేందుకు యత్నించాడు. అనుమానంతో అతడిని పట్టుకొని విచారిస్తే మాసాయిపేటకు చెందిన అతడి స్నేహితులు లక్ష్మణ్, జగన్‌లు జల్సాలకు అలవాటు పడి చేగుంట, తూప్రాన్, మెదక్, నిజాంపేట్, మేడ్చల్, హైదరాబాద్‌లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు దొంగలించి అమ్ముకుంటున్నట్లు తెలిపాడు. దొంగతనం చేసిన బైకుల్లో 6 బైకులను సిర్నాపల్లికి చెందిన శ్రీకాంత్‌కు అమ్మినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. మిగతా వాటిని మాసాయిపేటలోనే వారి ఇంటి సమీపంలో చెట్ల పొదల్లో దాచినట్లు అంగీకరించాడు. అతడి నుంచి 15 బైకులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మిగతా నిందితులు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

మెదడు వాపునకు జ్వరం తోడై..

యువకుడు బ్రెయిన్ డెడ్.


వికాస్ కుమార్(ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): యువకుడికి ఉన్న మెదడు వాపునకు తోడు జ్వరం బారిన పడి బ్రెయిన్ డెడ్‌తో మృతిచెందాడు.
ఈ సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో విషాదం నింపింది. మండలకేంద్రానికి చెందిన వికాస్ కుమార్ (36) మంగళవారం సికింద్రాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న అతను సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. సిబ్బంది రక్తన మూనాలు సేకరించి పరీక్షల కోసం తెలంగాణ డయాగ్నస్టిక్‌కు పంపించారు. అప్పటికే మెదడు వాపు ఉందని, జ్వరం బారిన పడ్డాడని మెడికల్ ఆఫీసర్ సాయిసింధు తెలిపారు. కాగా, అతడి పరిస్థితి మరింత విషమించడంతో మంగళవారం తెల్లవారుజాము కుటుంబసభ్యులు సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్‌తో యువకుడు మృతిచెందాడని వారు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

పటాన్‌చెరు టౌన్: అనుమానాస్పద స్థితిలో యువతి మృతిచెందిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బొల్లారం పారిశ్రామికవాడ .. మల్లంపేట సమీపంలో 25 సంవత్సరాల వయసు గల గుర్తుతెలియని యువతి అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. మంగళవారం పారిశుధ్య కార్మికుడు చెత్త సేకరణకు వెళ్లి గమనించినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదైంది.

మద్యంమత్తులో బైక్ నడిపి.. వృద్ధ జంటను ఢీకొట్టి..

కొల్చారం(నర్సాపూర్): మద్యంమత్తులో బైక్ నడిపి.. రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వెళ్తున్న వృద్ధ దంపతులను బైక్‌తో ఢీకొట్టారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. కొల్చారం మండలం అప్పాజీపల్లికి చెందిన రాజబోయిన జోగయ్య–శంకరమ్మ దంపతులు మండల పరిషత్ కార్యాలయంలో పని ఉండగా నడుచుకుంటూ వస్తున్నారు. ఇదే సమయంలో మెదక్ మండలం ఖాజిపల్లికి చెందిన ఇద్దరు బైక్ పై అతి వేగంగా వచ్చి వారిని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో జోగయ్య కాలు విరగగా, శంకరమ్మకు సైతం గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బైక్ నడుపుతున్న వారు మద్యం తాదగి ప్రమాదానికి కారణమయ్యారని ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం
– ఇద్దరిపై కేసు

కొముదవెల్లి(సిద్దిపేట): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కొమురవెల్లి ఎస్ఐ రాజు గౌడ్ మాట్లాడారు. గ్రామంలో రేషన్ బియ్యాన్ని కొంతమంది అక్రమంగా నిల్వ ఉంచారనే నమ్మదగిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలోని కడమంచి మల్లేశం, కడమంచి తిరుపతి ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 16.30 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

జింక మాంసం స్వాధీనం

పోలీసుల తనిఖీల్లో పట్టివేత

జోగిపేట(అందోల్): పట్టణంలో 5 కిలోల జింక మాసాన్ని మంగళవారం అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో జింక మాంసం విక్రయిస్తున్నట్లుగా జోగిపేట పోలీసులకు సమాచారం అందగా హౌసింగ్ బోర్డ్ ప్రాంతంలో తనిఖీ చేశారు. బైక్‌పై వెళ్తున్న గాండ్ల వాజీద్, దూదేకుల ఆసీఫ్ అనే ఇద్దరిని ఆపి తనిఖీలు చేశారు. వారి నుంచి 5 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిని అటవీ శాఖ అధికారులకు అప్పగించినట్లు జోగిపేట ఎస్ఐ పాండు తెలిపారు. మాంసం శాంపుల్‌లను ల్యాబ్ టెస్టింగ్‌కు పంపనున్నారు. సంగారెడ్డి అటవీ శాఖ కార్యాలయంలో వాజీద్, ఆసీఫ్‌లను విచారిస్తున్నట్లు వేణుగోపాల్ తెలిపారు.

చెరువులో పడి ఒకరు కుటుంబ కలహాలతో మరొకరు

వేర్వేరు చోట్ల ఇద్దరి ఆత్మహత్య


శ్రీనివాస్(42)

కంది(సంగారెడ్డి): చెరువులో పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చిమ్నాపూర్‌లో చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వినయ్ కుమార్ కథనం ప్రకారం... గ్రామానికి చెందిన రుద్రారం శ్రీనివాస్ (42) ఐఐటీ హైదరాబాద్‌లో హౌస్ కీపింగ్ విభాగంలో పని చేస్తున్నాడు. అతను మద్యం తాగొచ్చి తరచూ భార్య మాధవి, కూతురు కీర్తనతో గొడవ పడేవాడు. ఈ నెల 12న కూడా ఘర్షణ పడి రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. శ్రీనివాస్ ఆచూకీ కోసం తెలిసిన వారిని, బంధు మిత్రుల వద్ద వెతికినా ప్రయోజనం లేకపోయింది. మంగళ వారం ఉదయం ఊరు చెరువు కట్టపై స్కూటీ కనిపించింది. చెరువులో గాలించగా మృతదేహం బయటపడింది. మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


కరుణాకర్‌రెడ్డి (ఫైల్)

నర్సాపూర్ రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి నర్సాపూర్ సునీతారెడ్డి కాలనీలో చోటుచేసుకుంది. నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో అంతిరెడ్డి గారి కరుణాకర్ రెడ్డి (46), అంజలి దంపతులు నివాసముంటున్నారు. ఇద్దరి మధ్య జరిగిన గొడవ కారణంగా మనస్తాపం చెందిన అతను ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీరికి కూతురు కీర్తన రెడ్డి, కుమారుడు మనీశ్ రెడ్డిలు ఉన్నారు.

ఇంట్లో నుంచి వెళ్లి వృద్ధుడు.. పుట్టింటికి వెళ్తున్నానని వివాహిత..

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం


బాలరాజు (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శ్రీరాంనగర్ కాలనీకి చెందిన 65 ఏళ్ల బాలరాజు ఈనెల 10న తన సొంత నివాసమైన రాజేంద్రనగర్‌కు వెళ్తున్నానని చెప్పేసి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య సత్యమ్మ అతడి కోసం తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త అదృశ్యంపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్ఐ విజయరావు దర్యాప్తు చేస్తున్నారు.

గృహిణి..
మనోహరాబాద్(తూప్రాన్): తల్లిగారింటికి వెళ్లి వస్తానని చెప్పిన గృహిణి అదృశ్యమైన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ మండలం నాగుల్లపల్లికి చెందిన ఉప్పల నాగరాజు కొన్ని సంవత్సరాలుగా మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో నివాసం ఉంటూ బేకరీ నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అతని భార్య వరలక్ష్మి ఈ నెల 3న పుట్టిల్లయిన ఊరైన తూర్పుగోదావరి జిల్లా అమలాపురం మండలం మస్కపల్లికి పోతున్నానని చెప్పేసి వెళ్లింది. మరునాడు భర్త కాల్ చేయగా చేయొద్దని చెప్పి సెల్ స్విచ్ ఆఫ్ చేసినట్లు తెలిపారు. ఇటు అత్తగారింటికి చేరుకోలేదు. దీంతో బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో భార్య అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. కేసును నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


వరలక్ష్మి (ఫైల్)

భూసారం ఆధారంగా ఎరువులు

వరి రైతులకు తోర్నాల వ్యవసాయ శాస్త్రవేత్త పల్లవి సూచన


పల్లవి, తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త

దుబ్బాకటౌన్: జిల్లాలో వరి నాట్లు జోరందుకున్నాయి. కానీ వరిలో రసాయన ఎరువులను రైతులు ఏ సమయంలో వేయాలి. ఏ ఎరువులను ఏ మేరకు వాడాలి. ఎలా వేయాలో తెలియక ఏటా నష్టాలను మూట కట్టుకుంటున్నారు. కొన్ని చోట్ల అవసరమైన దాని కంటే ఎక్కువ ఎరువులను, మరి కొన్ని చోట్ల తక్కువ ఎరువులను వేస్తుండటంతో అనుకున్న స్థాయిలో దిగుబడులు రావడం లేదు. ఈ నేపథ్యంలో వరిలో రసాయన ఎరువుల వినియోగంపై తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పల్లవి రైతులకు తగు సూచనలు చేశారు.


వరిలో రసాయన ఎరువులు చల్లుతున్న రైతు

నత్రజని సద్వినియోగమవడం లేదు

వరిలో రైతులు రసాయన ఎరువులను 80 శాతం వరకు వేస్తున్నారు. యూరియా మోతాదుకు మించి రెండు, మూడు రెట్ల అదనంగా వేస్తున్నారు. ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో పొటాష్ వాడకమే లేదు. దీంతో వేస్తున్న రసాయన ఎరువులకు, వాటిని మొక్కలు వినియోగించుకుంటున్న శాతానికి మధ్య వ్యత్యాసం పెరుగుతుంది. దీని వలన జింక్, పొటాష్, ఇనుము మొదలగు లోపాలు ఏర్పడి నత్రజని సద్వినియోగమవడం లేదు.

పోషకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

వరిలో రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులను వాడి పోషకాలు అందించాలి. నత్రజని భాస్వరం, పొటాష్‌లను 4:2:1కు బదులుగా 9:5, 2.7:1 గా అందిస్తున్నారు. నీటి యాజమాన్య పద్ధతులు సరిగా లేకపోవడం వలన వేసిన ఎరువులు వివిధ రూపాల్లో నష్టపోతున్నాయి. పశువులు, కోళ్ల, కంపోస్ట్ వంటి సేంద్రియ ఎరువులను రసాయన ఎరువులతో కలిపి వేసినట్లయితే 20–25 శాతం వరకు రసాయన ఎరువులను ఆదా చేయవచ్చు. వరి పొలాల్లో పప్పు దినుసుల పంటలు, జనుము, జీలుగా వంటి పచ్చిరొట్ట పైర్లను సాగు చేస్తే భూసారం పెంచొచ్చు. భూసారాన్ని బట్టి ఎరువుల మోతాదును నిర్ణయించి, నత్రజని, భాస్వరం, పొటాష్, జింక్‌ను ఇచ్చే ఎరువులను సమంగా వేయాలని పల్లవి తెలిపారు.